క్లుప్తంగా

సీసీ రోడ్డు స్థలం కబ్జాకు యత్నం

ఏటూరునాగారం: సీసీ రోడ్డు స్థలాన్ని పలువురు కబ్జాకు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు వల్స శ్రీనివాస్, బండి లక్ష్మీ, కొప్పుల శ్రీను తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధి ఆకులవారిఘణపురం 12వ వార్డులోని 197, 198 సర్వే నంబరు కలిగిన భూమి సర్వర్ ఇంటి నుంచి వల్స శ్రీను ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం ఈజీఎస్ కింద గ్రామ పంచాయతీ ద్వారా చేపట్టినట్లు తెలిపారు. అయితే కొంత మంది సీసీ రోడ్డు నిర్మించిన స్థలం తమదని తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి సీసీ రోడ్డు వేసిన స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని వాపోయారు. గతంలో గ్రామ పంచాయతీ ఎలాంటి అభ్యంతరాలు లేవని తీర్మానించి సంవత్సరం క్రితం రోడ్డు వేసినట్లు తెలిపారు. ఈ భూమిని కొంత మంది కలిసి కబ్జా చేయాలని గతంలోనే ప్రయత్నించగా వారిని గ్రామపంచాయతీ ఏటూరునాగారం అధికారులు అడ్డుకోవడంతో వెనకకు తగ్గినట్లు తెలిపారు. ఇటీవల మళ్లీ కలెక్టర్‌ను కలిసి పత్రాలున్నాయని తప్పుదోవ పట్టిస్తున్నారు. కబ్జాదారులు కోర్టు నుంచి నోటీసులను సంబంధం లేని గ్రామ ప్రజలకు పంపిస్తూ ఏకంగా గ్రామ పంచాయతీ రోడ్డును కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



మంగపేట: మండలంలోని పాత బ్రాహ్మణపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఎస్ఆర్ఐ వెంకట్ సుశాంత్ పిప్పళ్ల తన పుట్టిన రోజు సందర్భంగా నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, టేబుల్ బుక్స్ స్టడీ మెటీరియల్‌ను జ్వాలా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కోడెల నరేస్, ప్రధాన కార్యదర్శి ద్వారా పాఠశాల హెచ్ఎం రాజేందర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



శ్రీను(ఫైల్)

వాజేడు: మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ధర్మసోతు శ్రీను(35) అనారోగ్యంతో చికిత్స పొందుతూ.. సోమవారం మృతి చెందాడు. ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీను పేరూరు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా 2022 సంవత్సరంలో విధుల్లో చేరారు. కొంత కాలంగా అనారోగ్యానికి గురి కావడంతో రెండు నెలల క్రితం వైద్యం కోసం సిక్ లీవ్‌పై హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి స్వగ్రామం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల పరిధిలోని హిమామ్‌నగర్‌గా తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి చేపల వేటకు వెళ్లి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బెస్తగూడెం గ్రామానికి చెందిన అట్టం నర్సింహారావు(42) ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. వల సహాయంతో చేపలను వేటాడే క్రమంలో వాగులో ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి గల్లంతయ్యాడు. రాత్రి నుంచి నర్సింహారావు ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వాగు వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుని భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



వాజేడు: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మొరుమూరు కాలనీ సమీప పొలాల్లో సోమవారం చోటు చేసుకుంది. విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సిబ్బంది విద్యుత్ లైన్లను పరిశీలిస్తూ వెళ్తుండగా నక్కా నాగేశ్వరావు పొలంలో విద్యుత్ తీగె తెగి పడి ఉండగా దాని సమీపంలో దుక్కిటెద్దు కూడా మృతి చెంది. విద్యుత్ తీగె తెగిన సమయంలో దుక్కిటెద్దు అక్కడికి రావడంతో దానికి తగిలి చనిపోయి ఉంటుందని చెప్పారు. దుక్కిటెద్దు ఎవరికి చెందినదో తెలియరాలేదని తెలిపారు.

అధ్వానంగా రహదారి

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రామచంద్రాపురం వద్ద దిగబడిన ఇసుకలారీ

వెంకటాపురం(కె): వెంకటాపురం, చర్ల ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు ఒక వాహనం రోడ్డు గుంతల్లో దిగబడుతుందని ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామం నుంచి ఆలుబాక వరకు సూమారు ఆరు కిలో మీటర్ల దూరం రోడ్డుపై పెద్ద సంఖ్యలో గుంతులు పడ్డాయి. దీనికి తోడు మండలంలో కురుసున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలబడి వాహనాలు దిగబడుతున్నాయి. రెండు రోజుల క్రితం అత్యవసర సేవల కోసం వెళ్లిన 108 వాహనం గుంతల్లో ఇరుక్కు పోయింది. సోమవారం ఉదయం రామచంద్రాపురం గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలో ఇసుక లారీ దిగడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కాగా అధికారులు జేసీబీ సాయంతో రోడ్డుపై ఇరుక్కుపోయిన లారీని బయటకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. నిత్యం ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైన స్పందించి మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాని స్థానికులు కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



ములుగు రూరల్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

- ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌కుమార్

గోవిందరావుపేట: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరప సతీశ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం భోజన విరామ సమయంలో సీపీఎస్ రద్దు చేస్తూ ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సీపీఎస్ రద్దు చేయుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్యామ్ సుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, సుమన్, స్రవంతి, సులోచన, రజిత, పావని, లక్ష్మీ, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ నాయకుడు హమీద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీశ్, రమేష్, రాజేందర్, మల్లయ్య, జాఫర్ అలీ, చంద్రమౌళి, మదన్మోహన్, రజిత, పుష్ప, ఉమాదేవి, రజిత, స్వాతి, సత్యం, పద్మజ, నీరజ పాల్గొన్నారు.



చల్వాయిలో..



ఏటూరునాగారంలో..

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఏటూరునాగారం: ఉద్యోగులపై శాపంగా మారిన కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పల్లె నాగరాజు, పోడెం సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పెన్షన్ విద్రోహ దినోత్సవం పేరుతో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు పొన్నం సాంబయ్య, రాజు, వెంకటేశ్వర్లు, సూర్య, సతీష్, జాకిర్ అలీ, రవి, రాములు, రాజుకుమార్, రమాదేవి, జయశ్రీ, మాధవి, రజిత, జ్యోతి, పద్మశ్రీ, మీనమ్మ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు

మంగపేట: మండలంలోని రాజుపేట(బ్రాహ్మణపల్లి)లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్‌ను సోమవారం అమర్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్‌లో అకినేపల్లిమల్లారం, బ్రాహ్మణపల్లి రెండు ఫీడర్లకు ఒకే బ్రేకర్ ఉండడంతో వివిధ సందర్భాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడేదన్నారు. దీంతో అంతరాయాన్ని నియంత్రించేందుకు రెండు ఫీడర్లకు వేర్వేరుగా ఉండేందుకు నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన బ్రేకర్ అమర్చడం వలన కత్తిగూడెం, దేవనగరం, అకినేపల్లిమల్లారం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. ప్రొటక్షన్ ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి, సబ్‌ఇంజనీర్ వెంకటేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



నూతన బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్

ఏటూరునాగారం: అరెస్టులు చేసి కార్మికుల ఉద్యమాలను ప్రభుత్వం ఆపలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ అన్నారు. సోమవారం మండలంలోని ఆశవర్కర్లు, నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దావూద్ మాట్లాడుతూ.. ఆశవర్కర్లు వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాదులో కమిషనర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాకు ఆశవర్కర్లు వెళ్తుంటే పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే అంతవరకు ఉద్యమాలు తప్పవన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఆశవర్కర్లు

యూరియా సకాలంలో అందించాలి

ములుగు రూరల్: రైతులకు యూరియా సకాలంలో అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా చేయడంలో విఫలమయిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత ప్రాంతాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లాలో వ్యవసాయానికి 15 వేల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా 11 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని అన్నారు.

బ్రిడ్జిని మరమ్మతులు చేయాలని వినతి

బండారుపల్లి గ్రామ సమీపంలోని రాళ్లవాగు బ్రిడ్జి వద్ద మరమ్మతులు చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ దివాకరకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువల రవీందర్ మాట్లాడుతూ.. రాళ్ల వాగు వద్ద నిర్మాణ పనులు పూర్తి కాలేదని అన్నారు. కాగా వర్షాలు కురుస్తుండటంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను రద్దు చేశారని దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైన అధికారులు రాళ్ల వాగు వద్ద మరమ్మతులు చేసి ఆర్టీసీ సర్వీస్‌ను నడిచే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, రాము తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సాంబశివ

42 శాతం బిల్లు ఆమోదం హర్షణీయం

మంగపేట: విద్యా ఉద్యోగ అవకాశాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకోసం రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమ అభివృద్ధికోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్క, పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకోసం బిల్లును ప్రవేశపెట్టగా సభ సంపూర్ణ మద్దతు తెలుపడం ఎంతో శుభపరిణామం అన్నారు. బీసీ బిల్లు అమలుకోసం మద్దతు తెలిపిన మంత్రి వర్గానికి, శాసన సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మిక గ్రంథంపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

ములుగు రూరల్: త్రైత సిద్ధాంత ప్రభోద సేవ సమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ వారి ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కాసిందేవపేటలో త్రైత సిద్ధాత, ఆధ్యాత్మిక గ్రంథంపై ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవ సమితి, ఇందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి, రజిత, వీరాస్వామి, విజయ, లలిత, సుధాకర్, సూజాత, కృష్ణ స్వరూప, సుష్మ, హేమలత తదతరులు ఉన్నారు.

గిరిజన చట్టాలను విస్మరించడం బాధాకరం

ఏటూరునాగారం: ఆదివాసీ బిడ్డను అని చెప్పుకొని గెలిచిన మంత్రి సీతక్క గిరిజన చట్టాలను విస్మరించడం చాలా బాధాకరమని ఆదివాసీ లిబరేషన్ ఫ్రంట్(ఏఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దబ్బకట్ల సుమన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కొమురం భీం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గంలో ఆదివాసీ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ఉన్నప్పటికీ గిరిజన చట్టాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పెసా గ్రామ సభలు లేవన్నారు. గత ప్రభుత్వాలు నియంత పరిపాలన చేసి గిరిజన చట్టాలను పక్కదారి పట్టించారని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా గిరిజన చట్టాలను ఆచరించడం లేదన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మొరుమూరు గ్రామ ప్రజలు

వాజేడు: అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని కోరుతూ మొరుమూరు గ్రామ పంచాయతీలోని పలువురు కోరారు. ఈ మేరకు కలెక్టర్ దివాకర టీఎస్‌కు సోమవారం ఫిర్యాదు చేసి అనంతరం మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొదటి లిస్టులో 81 మందికి ఇళ్లను ఇచ్చారని, ఇందులో 9 మందికి గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయన్నారు. తిరిగి సర్వే చేసి గతంలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన వారి పేర్లను తొలగించి అర్హులకు ఇవ్వాలని కోరారు. రాంబాబు, శరత్, శంఖర్, సమ్మయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

భారీ వర్షానికి కూలిన ప్రహరీ

మంగపేట: మండలంలోని పాలాయిగూడెంలో ఆదివారం రాత్రి కురిసన భారీ వర్షానికి గ్రామానికి చెందిన తోట రమేశ్ ప్రహరీ నేలమట్టం అయింది. ఇటీవల కురిసన భారీ వర్షాలతో పాటు పక్కనే పొలం ఉండడంతో పాటు భారీ వర్షాలకు భూమి కుంగి ప్రహరీ కూలిందని స్థానికులు భావిస్తున్నారు. దాదాపు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు రమేశ్ తెలిపారు.



నిమజ్జనాలను ప్రశాంతంగా చేయాలి

- పస్రా సీఐ దయాకర్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని వినాయకుల నిమజ్జనాలను నిర్వాహకులు ప్రశాంతంగా చేయాలని పస్రా సీఐ దయాకర్ అన్నారు. సోమవారం మండలంలోని గంగారంలోని అన్నారం పెద్ద చెరువును సీఐ దాయకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. చెరువులో గణపతి విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకుడి విగ్రహాల నిమజ్జనంలో నిబంధనలు పాటించాలన్నారు. మండలంలోని గ్రామాల వారీగా ఎంపిక చేసిన చెరువులు, వాగులు, కుంటల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు.



అన్నారం చెరువును పరిశీలిస్తున్న సీఐ దయాకర్

ఘనంగా గణపతుల నిమజ్జనం



టేకులగూడెంలో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు



వెంకటాపురం(కె)లో..

వాజేడు: ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణపతులను కొన్ని గ్రామాల భక్తులు సోమవారం కోలాహలం నడుమ నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని వాజేడు(గొల్లగుట్ట), పేరూరు, టేకులగూడెం, మొరుమూరు తదితర గ్రామాల్లోని గణపతులను ఊరేగింపుగా నిమజ్జన కార్యక్రమానికి తీసుకువెళ్లి పావన గోదావరిలో నిమజ్జనం చేశారు. స్వామి వారిని ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న సమయంలో యువతీ, యువకులు నృత్యాలతో సందడి చేశారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా గణపతి నిమర్జన కార్యాక్రమాన్ని సోమవారం గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. గణపతి మండపాల్లో ఐదు రోజుల పాటు పూజలు చేసిన ఆనంతం ఆరో రోజు నిమర్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయం సెంటర్, పాత మార్కెట్ సెంటర్, పెరిక వీధి, శివాలయంవీధిలలోని విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి పాత్రాపురం పంచాయతీలోని పాలెం వాగులో నిమర్జనం చేశారు.



మొరుమూరులో గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

ఆరో రోజు వినాయకుడికి పూజలు



వెంకటాపురం(ఎం): పూజలు చేస్తున్న భక్తులు



ములుగు రూరల్: అన్నం వడ్డిస్తున్న రవిచందర్

వెంకటాపురం(ఎం): గణపతి నవరాత్రులను పురస్కరించుకొని ఆరో రోజు సోమవారం మండలంలోని వినాయక మండపాల వద్ద ప్రజలు, భక్తులు పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం వద్ద మాజీ ఎంపీటీసీ పోశాల అనిత వీరమల్లు దంపతులు పూజలు చేశారు. శ్రీరామ యూత్ కమిటీ సభ్యులు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మామిడిశెట్టి కోటి, రామిడి కర్ణాకర్‌రెడ్డి, భూస గణేశ్, జంగిలి రవి, భూస సాంబయ్య, కందికొండ తిరుపతి, జంగిలి కుమార్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని క్రాస్‌రోడ్డు గణపతి మండపం వద్ద, గణేశ్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వీకరించారు. దీంతో గణపతి మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

అన్నదానం గొప్పది

ములుగు రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. వీవర్స్ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వారాహి రెస్టారెంట్ యజమాని బొమ్మగాని ప్రభాకర్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రాంభించారు. అనంతరం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నల్లెల్ల భరత్‌కుమార్, రేవంత్‌యాదవ్, పొడాల ఓంప్రకాశ్, ఇమ్మడి రాజుయాదవ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భజన కార్యక్రమాలు

జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవ మండపం వద్ద ప్రతీ రోజు భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సతీష్ కుమార్ తెలిపారు. నవరాత్రులు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి రోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లిలో వినాయక కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వాజేడు: జంగాలపల్లిలో..



ఏటూరునాగారం: క్రాస్‌రోడ్డు వద్ద..

పరిహారం చెల్లించే వరకు ఉద్యమం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర సందర్భంగా పంటలు సాగు చేయకుండా నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించేంత వరకు జాతర పంట నష్ట పరిహార సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని ఆ సమితి గౌరవ అధ్యక్షుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మేడారంలో జాతర పంట నష్ట పరిహార సాధన సమితి అధ్యక్షుడు ఆలం కృష్ణాఅర్జున్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారంలో ఈనెల 6న పంట నష్ట పరిహారం పరిహార సాధన సమితి ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని మేడారం, ఊరట్టం, కాల్వపల్లి, బయ్యక్కపేట, వెంగ్లాపూర్, నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు హాజరై విజయవంతం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా, ప్రజాసంఘాల నాయకులు, రైతుల సంఘాలు, కుల సంఘాల మద్దుతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు భూక్య శ్రీనివాస్, జంగా హన్మతంరెడ్డి, అలెం కిరణ్, కోశాధికారులు సమ్మారావు, సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, నరేందర్, చంద్రశేఖర్, సలహాదారులు చిడం బాబురావు, గొంది శ్రీధర్, సిద్దబోయిన శివరాజ్, కొమురయ్య, సమ్మిరెడ్డి, బాబురావు, రతన్‌సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి